

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న



పెన్‌గంగలో నిమజ్జనమవుతున్న గణనాథుడు

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

గంగమ్మ ఒడికి గణేశుడు



నెత్తిన బొజ్జ గణపయ్య ప్రతిమతో శోభాయాత్రలో చిన్నారి



వినాయక్‌చౌక్‌కు చేరుకున్న శోభాయాత్ర



నెలకొల్పిన చోటే నిమజ్జనమవుతున్న కుమార్ జనతా మండలి గణేశుడు

- ప్రశాంతంగా నిమజ్జనోత్సవం
- ఆనందోత్సాహాలతో శోభాయాత్ర
- వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే
- గణపతికి ఘనమైన వీడ్కోలు



శోభాయాత్రలో కోలాటమాడుతున్న చిన్నారులు

ఆదిలాబాద్: వాడవాడన పదకొండు రోజులపాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా కేంద్రంలో గురువారం గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి బొప్పా మోరియా.. బోలో గణేశ్ మహారాజ్‌కి జై.. అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బ్యాండ్ మేళాలు, డీజే పాటలు, బాజాభజంత్రీల మధ్య చిన్నాపెద్దా అనే తేడా లేకుండా శోభాయాత్రలో ఉత్సాహంగా నృత్యాలు చేశారు. జిల్లా కేంద్రంలోని కుమార్ జనతా ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశుడి వద్ద ఉన్న లడ్డూను ముస్లిం యువకుడు షేక్ ఆసిఫ్ వేలంలో రూ.1.02లక్షలకు దక్కించుకున్నాడు. అతడిని గణేశ్ మండలి నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

శోభాయాత్ర ప్రారంభించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలో సుమారు 360 గణపతి విగ్రహాలను నెలకొల్పారు. ఆనవాయితీ ప్రకారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాల నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించారు. అంతకుముందు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాగణపతి నిమజ్జనం షురూ..

జిల్లా కేంద్రంలోని కుమార్ జనతా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 48 అడుగుల మహాగణపతి నిమజ్జనోత్సవం గురువారం ప్రారంభమైంది. బావిపై నెలకొల్పిన స్థలంలోనే నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. బావిలోని నీటిని మోటారు సాయంతో విగ్రహాన్ని అభిషేకించారు. కాగా, భారీ విగ్రహ నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో వచ్చారు.

భారీ పోలీసు బందోబస్తు

నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 450మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోలీస్ కంట్రోల్‌రూం నుంచి సీసీ కెమెరాల పర్యవేక్షణతో నిరంతరం పరిస్థితి సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా వ్యవస్థ పటిష్టం చేసినట్లు చెప్పారు.

కనులపండువగా శోభాయాత్ర

వినాయక నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా జరిగింది. శోభాయాత్రలో మండపాల నిర్వాహకులు, మహిళలు, యువకులు, చిన్నారులు బ్యాండ్ మేళ తాళాల మధ్య స్టెప్పులు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాలను మండపాల నిర్వాహకులు వరుసక్రమంలో వినాయక్ చౌక్ నుంచి అశోక్‌రోడ్, అంబేద్కర్‌చౌక్ నుంచి శివాజీ చౌక్ మీదుగా జైనథ్ మండలంలోని పెన్‌గంగా నదికి తరలించారు.



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు



నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

భారీ జనసందోహం

వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పట్టణంలోని అశోక్ రోడ్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, నేతాజీచౌక్, వినాయక్‌చౌక్, శివాజీచౌక్ తదితర ప్రధాన కూడళ్లు జనసందోహంగా మారాయి. గణపయ్యలను వీక్షించేందుకు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు చేరుకున్నారు. ఉదయం 11గంటల నుంచి తెల్లవారే వరకు వీక్షించారు. పట్టణంలోని పలు దుకాణాల యాజమాన్యాలు, పలువురు భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ, తాగునీరు, పులిహోర ప్యాకెట్లు, పండ్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా మహిళలు ఇబ్బంది పడకుండా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. కాగా, పెన్‌గంగా నది వద్ద పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు మండపాల నిర్వాహకులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

న్యూస్‌రీల్

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీచైర్మన్



కేటీఆర్‌తో జనార్దన్ రాథోడ్, కుటుంబ సభ్యులు

కైలాస్‌నగర్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో గురువారం జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖానాపూర్ నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. భవిష్యత్‌లో తనకు ఉన్నతమైన పదవి ఇచ్చేందుకు కేటీఆర్ హామీ ఇచ్చినట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు. ఆయన వెంట ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ ఉన్నారు.

చెవిలో పూలతో నిరసన



సమ్మె శిబిరంలో చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆశ కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె నాలుగోరోజుకు చేరింది. గురువారం సర్కారు తీరును ఎండగడుతూ ఆశ కార్యకర్తలు చెవిలో పూలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లు వెంటనే నెరవేర్చకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆశ కార్యకర్తల సంఘం బాధ్యులు జ్యోతి, లక్ష్మి, ప్రేమలత, స్వప్న, మాధవి, పద్మ, సునీత పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులు, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముందుగా స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. జీవో 8 ప్రకారం తమకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెకు తుడుం దెబ్బ మద్దతు

ఆదిలాబాద్‌రూరల్: అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల నిరవధిక సమ్మెకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా కమిటీ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ఈ నెల 29వ తేదీన చేపట్టనున్న సమ్మెలో తుడుం దెబ్బ అనుబంధ సంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో 'నా మట్టి.. నా దేశం'



గ్రామస్తుల నుంచి మట్టి సేకరిస్తున్న మంత్రి పురుషోత్తం రూపాల, నాయకులు

నేరడిగొండ: ప్రధాని మోదీ 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని దేశమంతా చేపడుతున్నారని కేంద్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాల పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని బర్కపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమృత కలశంలో మట్టి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించి దేశం కోసం అమరులైన వీర జవాన్ల త్యాగాలు స్మరించుకునేలా ఢిల్లీలో అమృత వాటిక నిర్మించనున్నట్లు తెలిపారు. 'నా మట్టి–నా దేశం' కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారీ అల్జాపూర్ శ్రీనివాస్, నాయకుడు భూమయ్య, జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, విజయ్ బోయార్, హీరాసింగ్, ముకుంద్ తదితరులున్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమ్మెబాట'



పోరుసభలో మాట్లాడుతున్న జయలక్ష్మి

కైలాస్‌నగర్: కనీస వేతన చెల్లింపు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని పదేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జయలక్ష్మి పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల సమ్మె పోరు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 18న నిర్వహించిన జాయింట్ మీటింగ్‌లో ఇచ్చిన హామీలు విస్మరించి అంగన్‌వాడీలకు నమ్మక ద్రోహం చేశారని ఆరోపించారు. బతకడానికి అవసరమైన డిమాండ్లు నెరవేర్చాలని అడిగితే చావు ఖర్చులకు ఇచ్చే జీవోలు తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. 18 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. నిర్లక్ష్య వైఖరి వీడి రాష్ట్ర జేఏసీ నాయకత్వంతో వెంటనే చర్చలు జరిపి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోరుసభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు, కార్యదర్శి కూరపాటి రమేశ్, అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కే సునీత, నాయకులు డీ సునీత, రత్నమాల, జే సుభద్ర, గంగమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతి కల్పించాలి



పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన వారితో జిల్లా విద్యాధికారి ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టెట్ పేపర్–2లో ఉత్తీర్ణులైన వారికే పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. టెట్ ఉపాధ్యాయ నియామక అర్హత పరీక్ష మాత్రమేనని తెలిపారు. పండిత, పీఈటీ పదోన్నతుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అప్‌గ్రేడ్ అయిన 10,479 పండిత, పీఈటీ పోస్టులకు ఈ షెడ్యూల్‌లోనే పదోన్నతులు కల్పించాలన్నారు. పీఎస్ హెచ్‌ఎం పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని, సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన 5,571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి ఈ షెడ్యూల్‌లోనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవస్థకు నష్టం చేయకూడదని సూచించారు. ఇటీవల పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన వారిని డీఈవో ప్రణీత సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలంధర్‌రెడ్డి, నాయకులు బేర దేవన్న, ఆర్.సుజాత, సురేశ్ వైద్య, రంగినేని రామారావు, భూపతిరెడ్డి, కుడ్మెత భీమ్‌రావ్, గంగ్రత్ నారాయణ, వై.రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీతో ప'రేషా'న్

- బియ్యం అందవేమోనని ఆందోళన
- ఆధార్ అప్‌డేషన్ కోసం జనం క్యూ
- కిటకిటలాడుతున్న ఆధార్ కేంద్రాలు
- గంటల తరబడి ప్రజల పడిగాపులు



ఆధార్ అప్‌డేషన్‌కు పట్టణంలోని ఓ కేంద్రానికి వచ్చిన జనం

కైలాస్‌నగర్: రేషన్ కార్డుల్లో పేరు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలనే అధికారుల ప్రకటన లబ్ధిదారుల్లో గుబులు రేపుతోంది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకోకుంటే రేషన్ బియ్యం అందవేమోనని ఆందోళనకు గురి చేస్తోంది. ఈకేవైసీ చేసేందుకు ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి కావడంతో ఇది చేయించుకోని వారంతా పిల్లాపాపలతో ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. దీంతో కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి. అప్‌డేషన్ కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. జనం తాకిడి పెరిగిన నేపథ్యంలో ఆధార్ కేంద్రాల నిర్వాహకులు టోకెన్ సిస్టం అమలు చేస్తున్నారు. పది రోజుల వరకు ముందుగానే టోకెన్లు జారీ చేస్తున్నారు. దీంతో అప్పటికప్పుడు ఆధార్ అప్‌డేషన్ చేసుకుందామని వెళ్లిన వారికి నిరాశే ఎదురవుతోంది. పూర్తి స్థాయిలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేకపోగా ఉన్న కేంద్రాల లైసెన్స్‌లను రద్దు చేస్తుండటం సమస్యను మరింత జఠిలం చేస్తోంది. ఆధార్ అప్‌డేషన్ ప్రస్తుతం రేషన్ లబ్ధిదారుల పాలిట పరీక్షలా మారింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

ఇప్పటివరకు రేషన్‌కార్డులో ఎంతమంది సభ్యులున్నా ఒకరి బయోమెట్రిక్ వివరాలు నమోదై ఉంటే చాలు బియ్యం పొందే వెసులుబాటు ఉండేది. కానీ.. అనర్హులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్డులోని వారందరి బయోమెట్రిక్ వివరాలు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో కార్డులో పేర్లున్నవారంతా రేషన్‌షాపునకు వెళ్లి ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. జిల్లాలో చాలామంది ఇప్పటిదాకా ఆధార్ అప్‌డేషన్ చేసుకోలేదు. ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు పొందాలంటే కూడా ఆధార్ అప్‌డేషన్‌తో పాటు ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండాలి. ఈ రెండు ప్రక్రియలు ఏకకాలంలో జరుగుతుండటం, ఆధార్ అప్‌డేషన్ అయి ఉంటే తప్ప వాటిని పొందలేని పరిస్థితి ఉండటంతో ఇన్నాళ్లు ఆధార్‌ను తేలిగ్గా తీసుకున్న ప్రజలు ఒక్కసారిగా ఆధార్ కేంద్రాల బాట పడుతున్నారు.

కిటకిటలాడుతున్న కేంద్రాలు

జిల్లాలో ఆధార్ నమోదు సంస్థ (యూఐడీఏఐ)కు సంబంధించి 15 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇందులో ఇంద్రవెల్లి, తలమడుగు, బేల, జైనథ్, తాంసి మండలాలతో పాటు కలెక్టరేట్‌లోని ఆధార్ కేంద్రాల నిర్వాహకులు తప్పుడు సమాచారాన్ని పొందుపర్చారనే ఉద్దేశంతో వాటిని ఆ సంస్థ సస్పెండ్ చేసింది. దీంతో ఆయా మండలాల ప్రజలు ఆధార్ అప్‌డేషన్ కోసం ఆదిలాబాద్, ఉట్నూర్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక కొత్త మండలాలైన మావల, భీంపూర్, సిరికొండ, గాదిగూడలో ఇప్పటి వరకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇక్కడి జనం ఇచ్చోడ, ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలో పోస్టాఫీస్, బ్యాంకుల్లోని ఆధార్ కేంద్రాల్లో అప్‌డేషన్‌తో పాటు సవరణలు, మొబైల్ నంబర్ లింక్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ పనిభారంతో అందులో పని చేసే సిబ్బంది ఇందుకు సమ్మతించడంలేదు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు కేంద్రాలను పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి నుంచే చేసుకోవచ్చు

ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు కేంద్రాలకే వెళ్లాల్సిన అవసరం లేదు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారు తమ స్మార్ట్ ఫోన్‌లో ఇంటి నుంచే myaadhaar. uidai. gov. in ద్వారా చిరునామా, ఫోన్ నంబర్ లాంటి వివరాలు సరి చేసుకోవచ్చు. ఇందుకు ఈ నెల 14వరకు గడువు విధించిన కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 14వ తేదీవరకు పొడిగించింది. బయోమెట్రిక్ కోసం మాత్రం ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిందే.

– బండి రవి, ఈడీఎం, ఆదిలాబాద్

ఆందోళన అవసరం లేదు

ఈకేవైసీ లేకుంటే రేషన్ బియ్యం రావనే మాట పూర్తిగా అవాస్తవం. దీనిపై ప్రజలకు ఆందోళన అవసరం లేదు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. చిన్నారులు, వయోవృద్ధులు ఇప్పుడే రావాల్సిన అవసరం లేదు. వారు ఎప్పుడైనా ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చు. నిర్ణీత గడువంటూ ఏమీ లేదు. ప్రజలు హైరానా పడాల్సిన అవసరం లేదు. కానీ.. త్వరగా ఈకేవైసీ చేసుకుంటే మంచిది.

– కిరణ్‌కుమార్, డీఎస్వో

కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను కలిశారు. తనను కాదని నేరడిగొండ జెడ్పీటీసీ సభ్యుడు అనిల్ జాదవ్‌కు పార్టీ టికెట్ ఇవ్వడంతో నిరాశ చెందిన ఆయన నాలుగురోజుల క్రితం కేటీఆర్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఈక్రమంలో బాపురావు పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జోక్యం చేసుకొని రాథోడ్ బాపురావును నిర్మల్‌కు పిలిపించి మాట్లాడారు. కాగా, బాపురావు గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి పార్టీలో కొనసాగుతానని తెలియజేసినట్లు సమాచారం. బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ కూడా కేటీఆర్‌ను కలిసినట్లు తెలిసింది.

ఘనంగా గణేశ్ నిమజ్జనం


నిమజ్జనం ప్రారంభిస్తున్న నిర్వాహకులు


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కర్ర గణనాథుడికి జన వీడ్కోలు

తానూరు: పదకొండు రోజులు విశేష పూజలందుకున్న కర్ర గణనాథుడికి మండలంలోని భోసి గ్రామాల్లో గురువారం నిమజ్జనోత్సవం వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు నాగనాథ్ కర్ర వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. భోసిలో చివరి రోజు కర్ర వినాయకునికి దర్శించుకునేందుకు మండలంతో పాటు ఆయా గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో భోసి జనసంద్రంగా మారింది. ఆలయంలో ముందుగా ఉట్టికొట్టి శోభాయాత్ర ప్రారంభించారు. కర్ర వినాయకుని లడ్డూ రూ.21,500లకు గ్రామానికి చెందిన డాక్టర్ గంగాధర్ సొంతం చేసుకున్నాడు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం బావి సమీపంలోకి తీసుకెళ్లి నీళ్లచల్లి ప్రత్యేకంగా తయారు చేసిన బీరువాలో కర్ర వినాయకుని భద్రపరిచారు. బ్యాండ్ మేళాల చప్పులతో యువకులు తీర్మార్ స్టెప్పులు అలరించాయి.


భక్తులకు పులిహోరా అందిస్తున్న నాయకులు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఊరేగింపు

లడ్డూ వేలం రూ.26వేలు

లోకేశ్వరం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గణేశ్‌ల నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్ కర్ర వినాయక మండపం వద్ద 10రోజుల పాటు అదే గ్రామానికి చెందిన అశోక్ సేట్ అనే వ్యక్తి అన్నదానం నిర్వహించడంతో ఆయనను సన్మానించారు. ఇందులో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, నాయకులున్నారు.

లడ్డూ దక్కించుకున్న ముస్లిం..

మండలంలోని ధర్మోర గ్రామంలో గణేశ్ లడ్డూను వీడీసీ సభ్యులు వేలం వేయగా ఎస్‌కే అసిబొద్దీన్ పటేల్ రూ.26వేలకు దక్కించుకున్నాడు. అతడిని గ్రామస్తులు సన్మానించారు. మాజీ ఎంపీపీ మంద లింగన్న, వీడీసీ సభ్యులున్నారు.


ధర్మోరలో అసిబొద్దీన్‌కు లడ్డూను అందిస్తున్న నిర్వాహకులు

తాడిహత్నూర్‌లో ముస్లిం కుటుంబం పూజలు


పూజలో షాదుల్లాఖాన్ కుటుంబ సభ్యులు

నార్నూర్: మతసామరస్యానికి ప్రతీక గణేశ్ ఉత్సవాలని మండలంలోని తాడిహత్నూర్ గ్రామస్తులు నిరూపిస్తున్నారు. అదే గ్రామానికి షాదుల్లాఖాన్ ఏళ్లుగా గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉంటున్నాడు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా షాదుల్లాఖాన్ కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ మధుకర్, గ్రామ పెద్దలు గణేశ్ రాథోడ్, కిశోర్ చౌహాన్, పరుశరాంఉన్నారు.

గణపతి లడ్డూ రూ.1,51,111


లడ్డూతో సాయికిరణ్ గౌడ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రుద్రాక్ష్ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన లడ్డూకు వేలం పాటలో భారీ ధర పలికింది. జిల్లా కేంద్రానికి చెందిన అమరబోయిన సాయికిరణ్ గౌడ్ రూ.లక్షా 51వేలా 111లకు దక్కించుకున్నాడు. అనంతరం గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు.

క్లుప్తంగా

దుబాయ్ అందాల పోటీలకు జిల్లా వాసి


వినయ్ రాజ్

నేరడిగొండ: దుబాయ్‌లో వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్నేషనల్ అందాల పోటీలకు మండల కేంద్రానికి చెందిన వినయ్ రాజ్ ఎంపికయ్యాడు. గ్లోబల్ హ్యాండ్సమ్ ట్రేజర్ అండ్ గ్లోబల్ బ్యూటీ ట్రేజర్ కంపెనీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కంపెనీ డైరెక్టర్ అండ్ సీఈఓ సుహాసిని పండ్యమ్ తెలిపారు. మిస్టర్ ఇండియా అందాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు దుబాయ్‌లో నిర్వహించే పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వినయ్ రాజ్ పేర్కొన్నారు.

కర్ర గణపతి ఆలయ నిర్మాణానికి కృషి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

లోకేశ్వరం: కర్ర గణపతి ఆలయం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి నిర్మించేందుకు కృషి చేస్తామని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం అబ్దుల్లాపూర్ కర్ర గణపతి నిమజ్జనం ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అర్లి వంతెన నుంచి వితోలితండా వరకు రోడ్డు నిర్మాణం పనులను చేపడుతామన్నారు. సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు గంగాధర్, రాజారెడ్డి, దేవన్న, భోజారాం ఉన్నారు.

వర్షానికి కుప్పకూలిన ఇల్లు


కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తదితరులు

సారంగపూర్: మండలంలోని కొట్ట(బి) గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన దాసరి ముత్యంకు చెందిన ఇల్లు రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం రాత్రి కుప్పకూలింది. ఇంట్లో ముత్యం, భార్యతో కలిసి భోజనం చేసే సమయంలోనే ఇల్లు కూలిపోవడం గమనించి ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టడడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో కట్టుబట్టలే మిగిలాయని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, స్థానిక రైతు బంధు సమన్వయ సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇప్ప మధుకర్‌రెడ్డి, స్థానిక నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

భైంసా వాసికి ఫ్రౌడ్ ఆఫ్ ఇండియా అవార్డు


ఉప్పు రవీందర్

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన యోగా శిక్షకుడు ఉప్పు రవీందర్‌కు ఫ్రౌడ్ ఆఫ్ ఇండియా అవార్డు వరించింది. యోగాసన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యోగా శిక్షణకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు ఇచ్చినట్లు రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ట్రోఫీ, అవార్డు పోస్టులో రాగా యోగాసన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజీరావు చేతుల మీదుగా అందుకున్నారు.

అంగన్‌వాడీ లబ్ధిదారులతో విచారణ

సాక్షి ఎఫెక్ట్

గుడిహత్నూర్ : 'అమ్మకానికి అంగన్‌వాడీ గుడ్డు' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ద్వారా క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, ఆయా, స్థానిక లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే సదరు దుకాణదారుడు అంగన్‌వాడీ గుడ్లను అమ్మలేదని స్పష్టం చేశాడు. అయితే ఆ గుడ్లు ఎక్కడి నుంచి వచ్చాయానే దానిపై వాకబు చేయగా కాలనీకి దూరంలో ఉన్న మరో కిరాణ దుకాణం యజమాని కోడలు గర్భవతి కావడంతో వచ్చిన గుడ్లను పాడుకాకుండా తన కిరాణ దుకాణంలోని ఫ్రిడ్జ్‌లో ఉంచాడు. తాను లేని సమయంలో రెండు గుడ్లను తన కుమారుడు వడ్డెర కాలనీకి చెందిన మహిళకు విక్రయించాడని, అయితే ఇది అనుకోకుండా జరిగిందని వాస్తవానికి అంగన్‌వాడీ గుడ్లను విక్రయించడం లేదని దుకాణదారుడు తెలిపినట్లు గుర్తించారు. అంగన్‌వాడీ గుడ్లను విక్రయించకుండా చిన్నారులకు వండి పెట్టాలని పద్మ లబ్ధికారులకు సూచించారు. దీంతో పాటు గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలోనే వండిన గుడ్లను తినాలని, చిన్నారులకు తినిపించాలని కోరారు. అంగన్‌వాడీ గుడ్లను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


విచారణ చేపడుతున్న సూపర్‌వైజర్ పద్మ

ఆటలతో విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పేయ్

నిర్మల్‌చైన్‌గేట్: ఆటలతో విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెందుతుందని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా డివిజన్ స్థాయి గిరిజన క్రీడా ఉత్సవాలకు గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించి విద్యార్థుల చేత గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. జిల్లా గిరిజన విద్యార్థులు ఆటలతో పాటు చదువులో కూడా ముందున్నారన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఆటల పోటీల్లో రాణించాలని జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరుకు తనవంతు కృషి చేస్తానని వివరించారు. డివిజన్ స్థాయి క్రీడలకు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినందుకు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఏసీఎంవో నిర్మల్ ఆర్.శివాజీ, క్రీడా, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుడు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఐటీడీఏ పీవో

గణేష్ నిమజ్జనోత్సవంలో ది గ్రేట్ ఖలీ

- స్వాగతం పలికిన ఎమ్మెల్యే జోగు రామన్న
- జిల్లా కేంద్రంలో శోభాయాత్ర


ఖలీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రామన్న, ఖండేష్కర్, బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: దేశంలో బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న వరల్డ్ స్టార్ రెజ్లర్ ది గ్రేట్ ఖలీ (దలీప్ సింగ్ రాణా) గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సందడి చేశారు. ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తిర్పెల్లిలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్రలో ఆ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్‌తో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఖలీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంలో అశోక్ రోడ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు జరిగిన శోభాయాత్రలో పాల్గొని అభిమానులు, ప్రజలను ఉత్సాహపర్చారు. ఆయన జిల్లా కేంద్రానికి రావడంతో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి అభిమానులు, ప్రజలు ఆయనను చూసేందుకు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు ట్రయల్‌రన్ సక్సెస్

- పలు గ్రామాలకు హెచ్చరికలు జారీ చేసిన తహసీల్దార్
- రాత్రి కావస్తున్న నీళ్లు రాకపోవడంతో నిరాశకు గురైన రైతులు
- రాత్రి 10.30 గంటలకు కాల్వలోకి నీళ్లు


మోటర్ నుంచి కాల్వలోకి పెనుగంగ..

జైనథ్: కోర్ట–చనాఖా బ్యారేజీలో భాగంగా లిఫ్ట్ ఇరిగేషన్ కోసం, హట్టిఘాట్ వద్ద నిర్మించిన పంప్‌హౌజ్‌లో బుధవారం అధికారులు వెట్ రన్ నిర్వహించిన విషయం తెలిసిందే. డ్రైరన్ సక్సెస్ కావడంతో అధికారులు గురువారం ఉదయం నుంచి పంప్‌హౌజ్ లోపల వెట్ రన్ కోసం శ్రమిస్తున్నట్లు తెలిసింది. గురువారం ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధమైన అధికారులు సాయంత్రం హెచ్చరికలు జారీ చేశారు. తహసీల్దార్ ఆదిలాబాద్ వాట్సాప్ గ్రూపులో పెన్‌గంగ ఈఈ రవీందర్ పంపించిన మేసేజ్‌తో జైనథ్‌లో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం 300 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో జైనథ్ తహసీల్దార్ వివిధ గ్రామాల గ్రూపుల్లో హెచ్చరికలు జారీ చేశారు. మండల రైతులు రాత్రి వరకు చూసినప్పటికీ కాలువల్లో నీళ్లు రాలేదు.


డ్రైరన్ నిర్వహించిన 5.5 మెఘావాట్ మోటర్

ట్రయల్ రన్ ఏమైంది?

రాత్రి వరకు నీళ్ల కోసం ఆయా గ్రామాల్లో రైతులు ఎదురుచూసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ట్రయల్ రన్‌లో ఏమైందని మండల వాసులు చర్చించుకున్నారు. అయితే డ్రైరన్ సక్సెస్‌తో ఉత్సాహంగా ఉన్న అధికారులు వెట్ రన్ (ట్రయల్ రన్) నిర్వహించేందుకు సిద్ధమై, గురువారం ఉదయం నుంచి పంప్‌హౌజ్ వద్దనే ఉన్నట్లు తెలుస్తోంది. ట్రయల్ రన్ కోసం 5.5 మెఘావాట్ మోటర్‌ను ఆన్ చేసినప్పటికీ ట్రిప్ కావడంతో ట్రయల్ రన్ ఆలస్యమైనట్లు తెలుస్తోంది. మరోవైపు ట్రయల్ రన్ ఫెయిలైనట్లు పుకార్లు షికార్లు చేశాయి. అయితే లిఫ్ట్ ఇరిగేషన్ స్టేట్ అడ్వైజర్ పెంటారెడ్డి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాము, ఈఈ రవీందర్ ఉదయం 7 గంటల నుంచి పలుమార్లు ట్రయల్ రన్ నిర్వహించగా రాత్రి 10.30 గంటలకు సక్సెస్ అయినట్లు వారు తెలిపారు. దీంతో అధికారులతో పాటు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కడెం ప్రాజెక్ట్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న మెకానికల్ సిబ్బంది


స్పిల్ వే ముందర విరిగిపడిన కౌంటర్ వెయిట్

- కిందకు దిగిన గేటు
- తగ్గిన ఔట్ ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్ 15వ నంబర్ వరద గేటుకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. గురువారం స్వప్న కన్‌స్ట్రక్షన్ మెకానికల్ సిబ్బంది కౌంటర్ వెయిట్ విరిగిన వరద గేటును కొద్దిగా కిందకు దించారు. జాకీల సహాయంతో పూర్తిగా గేటుకు కిందకు దించే ప్రయత్నం చేస్తున్నారు. వరద గేటు కిందకు దిగడంతో ఔట్ ఫ్లో తగ్గింది. విరిగి పడిన కౌంటర్ వెయిట్ స్పిల్‌వేపై కనబడుతోంది. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 697.550 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టులోకి 1,824 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1518 క్యూసెక్కులు ఔట్ ఫ్లోగా వెళ్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పనులను ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈ రవికుమార్, గణేశ్, సర్వార్ పర్యవేక్షిస్తున్నారు.

బాసరలో ట్రాఫిక్ ఆంక్షలు

- భారీగా తరలిరానున్న గణనాథులు
- గోదావరి నది వద్ద ఏర్పాట్లు

భైంసా: బాసర గోదావరినదిలో భారీగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు తరలివస్తారు. ఏటా వందల సంఖ్యలో విగ్రహాలను గోదావరినదిలోనే నిమజ్జనం చేస్తారు. ఈ ఏడు గురువారం సాయంత్రం నుంచే ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా నది వైపువెళ్లే రోడ్డును మూసివేశారు. నిజామాబాద్, హైదరాబాద్, బోధన్ వెళ్లే వాహనాలను బిద్రెల్లి, ధర్మాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు మూసివేశామని, వాహనదారులు సహకరించాలని ముథోల్ సీఐ వినోద్ సూచించారు.

నది వద్ద ఏర్పాట్లు..

హైదరాబాద్, మేడ్చల్, కామారెడ్డి, బోధన్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి కొన్నేళ్లుగా వినాయక విగ్రహాలను బాసర గోదావరి నదిలోనే నిమజ్జనం చేస్తున్నారు. భారీగా తరలివచ్చే విగ్రహాల నిమజ్జనం సందర్భంగా గోదావరి నది వద్ద భారీ క్రేన్లు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేసి నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. నిజామాబాద్ నుంచి బాసర వరకు రెండు జిల్లాల పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.


గోదావరి నది వద్ద రోడ్డు మూసేసిన పోలీసులు

అదృశ్యమై..శవమయ్యాడు


కట్కం నరేష్(ఫైల్)

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన యువకుడు కట్కం నరేష్(27) అదృశ్యమై బుధవారం రాత్రి 10గంటల తర్వాత శవమై కనిపించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 26న ఉదయం జిల్లా కేంద్రం నుంచి ఇంటికి వస్తున్నానని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు అదృశ్యమైనట్లు తండ్రి మార్కండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎంత వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. బుధవారం రాత్రి స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మశాల(కె) రెవెన్యూ గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ నెల 26న తండ్రి మార్కండి కుమారుడు నరేష్ అదృశ్యమైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి వాగులో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతుడి ఒంటిపై ధోతి, చొక్కా ధరించి ఉన్నాడని, వయస్సు 60 నుంచి 65 ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఏంకా కాలనీకి చెందిన ఇరుమల్ల లక్ష్మి (36) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... ఇరుమల్ల లక్ష్మి రెండేళ్ల క్రితం కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు శాస్త్ర చికిత్స చేయించారు. బుధవారం ఆమెకు మళ్లీ కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే శ్యాంపూర్ ఆర్‌ఎంపీ వైద్యుడిని సంప్రదించారు. ఆయన సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తున్న క్రమంలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రైతు మృతి


మహేందర్ మృతదేహం

కుంటాల: పిడుగుపాటుకు రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని అంబకంటి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మహేందర్ (32)తనకున్న పత్తి చేనులో మందు పిచికారీ చేసేందుకు కూలీ ముత్యంతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో మామిడి చెట్టు కిందకు వెళ్లారు. అంతలోనే పిడుగుపడడంతో మహేందర్ అక్కడికక్కడే మృతిచెందగా ముత్యంకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు.

భైంసాలో పలువురిపై కేసు

భైంసాటౌన్: గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు యువకులపై లాఠీచార్జి చేశారనే ఆరోపణలతో శోభాయాత్ర అడ్డుకుని పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్నారు. ఈ మేరకు గాలి రవి, అల్లం దిలీప్, షిండే కపిల్, కాసర్ల రామకృష్ణ, రావుల రాము, జే శ్రీకాంత్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నాగరాజు (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: వినాయక నిమజ్జనంలో పాల్గొని తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన ఉట్నూర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని సేవదాస్‌నగర్‌కు చెందిన ఆడ నాగరాజు (23) స్నేహితులతో కలిసి బుధవారం రాత్రి వినాయక నిమజ్జనంలో పాల్గొన్నాడు. స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పాత బస్టాండ్‌కు వస్తుండగా అంగడీబజార్ ప్రాంతంలో ఎదురుగావస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజ్, అతడి స్నేహితుడు మణికంఠ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరాజును ఆదిలాబాద్ రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. నాగరాజు బంధన్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు లారీలు ఢీ..

జైపూర్(చెన్నూర్): జైపూర్ మండలం ఇందారం రాజీవ్ రహదారిపై ఐకే–1 గని మూల మలుపు వద్ద గురువారం రాత్రి రెండు లారీలు ఢీ కొన్నాయి. చెన్నూర్ నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీడ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనకాలే బొగ్గు లోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. బొగ్గు లారీ డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి.